-నగర ప్రజలకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజయర్వాయర్ల నీళ్లు

-ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నీటి వినియోగానికి మార్గం సుగమం



హైదరాబాద్ మార్చి 29 ప్రభాతవార్త: జంటనగరాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్ సాగర్ రిజయర్వాయర్లలోని నీటిని ఏడు సంవత్సరాల తర్వాత వినియోగించబోతున్నారు. వచ్చే ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ సీవరేజ్‌బోర్డు(వాటర్‌బోర్డు) ప్రతి రోజు ఆ రెండు రిజర్వాయర్ల నుంచి 40 మిలియన్ గ్యాలన్ల నీటిని వినియోగించబోతున్నారు. ప్రస్తుతం ఆ రెండు రిజర్వాయర్ల నుంచి వచ్చే కొంత నీటిని నగరంలోని కొన్ని ప్రాంతాలకు, పాత నగరానికి వినియోగించారు. కాగా ఈ రెండు రిజర్వాయర్ల నుంచి నీటిని వినియోగించడం అనివార్యమైన పరిస్థితిలో ఉన్నందున గత కొన్ని నెలల నుంచి నీటి వినియోగం తప్పనిసరి కావడంతో పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ఉస్మాన్‌సాగర్ నుంచి గత కొన్ని సంవత్సరాల నుంచి ఉస్మాన్‌సాగర్ నుంచి 25 మిలియన్ గ్యాలన్‌లు, మరో 15 మిలియన్ గ్యాలన్‌లు హిమాయత్‌సాగర్ నుంచి వినియోగించుకునేందుకు అవకాశం ఉండగా, వాటర్‌బోర్డు మాత్రం కేవలం 14 మిలియన్ గ్యాలన్‌లు, 2.8మిలియన్ గ్యాలన్‌లు ఆ జంట రిజర్వాయర్ల నుంచి గత కొన్ని సంవత్సరాల నుంచి వినియోగించుకుంటున్న విషయం తెలిసిందే. గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు హిమాయత్‌నగర్, ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్ల నీటిని కేవలం విల్లాలకు, గేటెడ్ కమ్యునిటీలకు వినియోగించాలనే ఆదేశాల ఉండడం, నాటి నుంచి ఆ నీటిని వినియోగించడానికి అధికారులు చర్యలకు ఉపక్రమించలేదు. ముఖ్యంగా ఆ రెండు రిజర్వాయర్లలో నీరు పూర్తిగా నిండినా కూడా నీటిని కూడా వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ రెండు రిజర్వాయర్ల నుంచి నీటిని వినియోగించడానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో పాటు జంటనగరాల ప్రజల అవసరాలకు నీటిని వినియోగించుకోవడానికి మరోసారి మార్గం సుగమం అయింది. మరోవైపు ప్రజలకు నీటి అవసరాలకు ఎంతో అనుగుణంగా ఉన్న కృష్ణా, గోదావరి నదుల్లో నీరు అడుగంట పోయిన పరిస్థితి ఏర్పడడంతో నగరంలో నీటి కొరత ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో మంచి నీటి ట్యాంకర్ల వాడకం డిమాండ్ మూడు రేట్లు పెరిగిందని అధికారులు చెబుతున్నారు. 2023 లో మంచినీటి ట్యాంకర్ల ట్రిప్పులు 1.12లక్షలు ఉండగా 2024 ఇప్పటి వరకు ఆ ట్రిప్పుల సంఖ్య 1.34లక్షలకు పెరిగింది. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటి వినియోగం అధికంగా ఉండడంతో ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి మరో 20 అదనంగా నీటిని నింపే కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో లైసెన్సులు లేకుండా మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటి వాడకం అధికంగా ఉండడం 60 తుప్పుబట్టిన ట్యాంకర్ల ద్వారా నీటిని వినియోగించారు. డిమాండ్ అధికంగా ఉండడంతో గత కొన్ని సంవత్సరాల నుంచి ట్యాంకర్లు కూడా తుప్పు బట్టిపోయాయి.

ఈసారి 50శాతం పెరిగిన ట్యాంకర్ల డిమాండ్: దానకిషోర్

వచ్చే నెల మొదటి వారం నుంచి 24 గంటల పాటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ట్యాంకర్ల డిమాండ్ 50 శాతం పెరిగిందని వివరించారు. ఇక వినియోగదారుల నుంచి డిమాండ్‌కు తగ్గట్టుగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోజుకు 9వేల ట్రిప్పుల నీటిని సరఫరా చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. వాణిజ్య అవసరాలకు నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా నైట్ షిఫ్ట్ ఏర్పాటు చేశారు. ప్రతి ఫిల్లింగ్ స్టేషన్ నుండి వాణిజ్య వినియోగదారుల కోసం 300 అదనపు ట్రిప్పులు సరఫరా చేయబడతాయి. ఇందుకోసం కొత్తగా 250 ట్యాంకర్లను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. జిహెచ్ఎంసి, ఇతర మార్గాల ద్వారా 250 మంది డ్రైవర్లను నియమించనున్నారు. ఏప్రిల్ మొదటి వారం నాటికి అదనపు ఫిల్లింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తు అవసరాల కోసం 7 డివిజన్లలో మొత్తం 20 కొత్త ఫిల్లింగ్ స్టేషన్లు, జిహెచ్ఎంసిలో ఆరు, జిహెచ్ఎంసికి మించిన ఓఆర్ఆర్‌లో 14 ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లో నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త : నగరంలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని ప్రధాన చర్చిలలో యేసు శిలువ ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రేత్యక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సర్వమానవాళి పాప పరిహారం కోసం యేసు శిలువను మోశాడని ఈ సందర్భంగా పాస్టర్లు తమ సందేశ కార్యక్రమాల్లో వివరించారు. సికింద్రాబాద్, అబిడ్స్, కూకట్‌పల్లి, మణికొండ, ముషీరాబాద్, అంబర్‌పేట, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లోని ప్రధాన చర్చిల్లో ఉదయం నుంచే భక్తుల తాకిడి కన్పించింది.



కీలకంగా మారిన మల్కాజ్‌గిరి ఎంపి సీటు..

-ప్రధానంగా పోటీకి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు సమాయత్తం..ప్రచారం షురూ..

-కొనసాగుతున్న రాజకీయ సమీకరణలు..? -దేశంలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్న వైనం



హైదరాబాద్ మార్చి 29, ప్రభాతవార్త

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం కీలకంగ మారింది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు సవాల్‌గ తీసుకుని సమావేశాలు, సమీక్షలు, కసరత్తులు చేపట్టి ముందుకు వెళుతు మల్కాజ్‌గిరి సీటును సాధించాలన్న లక్ష్యంతో ఆయా పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఓటర్ల సంఖ్యలో పరిశీలిస్తే ఎక్కడ లేని విధంగ దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గంగ మల్కాజ్‌గిరి ఎంపి సీటు ఉంది. ఇప్పటి వరకు మాత్రం సుమారు 37లక్షల28వేల417ఓట్లు ఉండి అతి పెద్ద నియోజకవర్గంగ నిలిచింది. మేడ్చల్ జిల్లాలోని మల్కాజ్‌గిరి ఎంపి సీటు పరిధిలో మేడ్చల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్, ఎల్‌బి నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మల్కాజ్‌గిరి ఎంపి స్థానాన్ని దక్కించుకోవటానికి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు తమ కసరత్తులు చేపట్టాయి. అయితే మల్కాజ్‌గిరి ఎంపి సీటు కాంగ్రెస్‌కు సిట్టింగ్ స్థానం కావటం, గత ఐదేళ్లుగ ఎంపిగా పనిచేసిన ఎ. రేవంత్‌రెడ్డి ఇటీవలనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావటం ప్రత్యేకతను చాటుకుందని చెప్పవచ్చు. మల్కాజ్‌గిరి ఎంపిగా పనిచేసిన రేవంత్‌రెడ్డి సిఎంగా కొనసాగుతుండటంతో కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి సీటును ఎలాగైనా దక్కించుకోవాలని ఛాలంజ్‌గా తీసుకుని కాంగ్రెస్ శ్రేణులతో నిత్యం సమీక్షించుకోవటం, ప్రత్యేకంగ సిఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి పైనే ప్రత్యేక దృష్టి సారించి కాంగ్రెస్ నాయకులను మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ గెలవాల్సిందేనని స్పష్టం చేయటంతో కాంగ్రెస్ క్యాడర్ ఇక దూకుడు పెంచారు. వికారాబాద్ జడ్పీచైర్మన్‌గా ఉన్న పి.సునీతామహేందర్ రెడ్డికి మల్కాజ్‌గిరి కాంగ్రెస్ టికెట్ ఇవ్వటంతో ఇప్పటికే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ ముందుకు వెళుతున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి కూడ తరుచూ మల్కాజ్‌గిరి సీటును కాంగ్రెస్ కైవసం చేసుకోవటానికి ప్రత్యేక దృష్టిని సారించి పార్టీ శ్రేణులను రంగంలోకి దింపింది.

(మిగతా రెండో పేజీలో..)

మెట్రో రైలు ప్రాజెక్టును సందర్శించిన ఫ్రెంచ్ రాయబారి

హైదరాబాద్, మార్చి 29 ప్రభాతవార్త

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ఫ్రెంచ్ రాయబారి బృందం ప్రత్యేకంగా పరిశీలించింది. భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ ఆయన బృందానికి ఎల్‌అండ్‌టి మెట్రో రైలు లిమిటెడ్ అధికారులు శుక్రవారం స్వాగతం పలికారు. ఉప్పల్‌లోని మెట్రో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. మెట్రో రైల్ నెట్ వర్క్‌కు సంబంధించిన రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, రియల్ టైమ్ సిస్టమ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలన్నీ నిర్వహణకు అది సెంట్రల్ హబ్‌గా వ్యవహరిస్తుందని మెట్రో అధికారులు ప్రతినిధులకు వివరించారు. పట్టణ ప్రాంత రవాణా విభాగంలో వినూత్న, సాంకేతిక పురోగతికి నిదర్శనమైన హైదరాబాద్ మెట్రో రైల్వే వ్యవస్థ ఎంతగానో ఆకట్టుకుందని ఫ్రెంచ్‌రాయబారి థియెరీ మాథ్యూ తెలిపారు. భవిష్యత్తులోనూ కలిసి చేసేందుకు, సుస్థిరమైన అర్బన్ మొబిలిటీ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు మాథ్యూ బృందం దోహదం చేస్తుందని మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

నాగోల్‌లోని మెట్రో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఫ్రెంచ్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ బృందం, చిత్రంలో మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి తదితరులు

3వ సారీ మోడీ ప్రధాని..కిషన్‌రెడ్డి ధీమా

అడ్డగుట్ట,మార్చి 29 ప్రభాతవార్త: ప్రధాన మంత్రిగా దేశంలో నరేంద్ర మోదీ బాధ్యతలు చేపడుతారని కేంద్ర మంత్రి,సికింద్రాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి జి.కిషన్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. శుక్రవారం అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్‌లో నిర్వహించిన బిజెపి కార్యకర్తలు, వివిధ కులసంఘాలు, బిజెపికి మద్దతు తెలుపుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో కృషి చేశారన్నారు. 500 సంవత్సరాల చరిత్ర కలిగిన అయోధ్య రామ జన్మభూమి ఆలయ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమైందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పోటీ చేయడానికి సిద్ధంగా లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కె.కేశవ రావ్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డిలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాష్ట్రంలో బిఆర్ఎస్ కనుమరుగైందన్నారు. రాష్ట్ర ప్రజలు కేసిఆర్‌పై ఉన్న కోపంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీని, సికింద్రాబాద్ పార్లమెంట్ ఓటర్లు తమను ఆశీర్వదించి అంకిత భావంతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహంకాలి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, రాష్ట్ర రవిప్రసాద్ గౌడ్, అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు సి.హెచ్.కన్నాభిరామ్, అంబాల మహేశ్, గెల్లు ఉదయ్ యాదవ్, సాయిబాబా, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన కె. క్రిష్ణ, వి.నర్సింగ్‌రావ్‌లతో వివిధ కుల సంఘాలకు చెందిన నాయకులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు.

ఆర్యవైశ్య సంఘం నేత గణేష్,వడ్డె సంఘం నేత వెంకటేశ్, విశ్వకర్మ సంఘం నేత పి. క్రిష్ణలు బిజెపి పార్టీలో చేరారు.

అడ్డగుట్ట కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు

పార్టీ మారడం లేదు

-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

-మనవరాలి పెళ్లి పనుల్లో బిజీ ఉండటంతో సమావేశానికి పోలేదు

అత్తాపూర్ మార్చి29, ప్రభాతవార్త : తెలంగాణ భవన్‌లో శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరుకాకపోవడంతో ఆయన పార్టీ మారుతున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం కొనసాగుతోంది. దింతో ఈవిషయంపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పందించారు. ఈ నెల 31న మనవరాలి పెళ్లి సందర్భంగా పనుల్లో బిజిగా ఉండడంతో వెళ్లలేకపోయానని అంతమాత్రనా ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడం తగదని ఖండించారు. బుధవారం మాజీ సిఎం కెసిఆర్,ఎమ్మెల్యే కెటిఆర్‌లకు మనవరాలి పెళ్లి ఆహ్వాన పత్రిక అందజేసిన విషయం తెలిసిందే.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

ఎర్రగడ్డ సుల్తాన్ నగర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ హోం మంత్రి మహ్మద్‌అలీ, ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

యూసుఫ్‌గూడ, మార్చి 29, ప్రభాతవార్త : ఇఫ్తార్ విందును మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని రాష్ట్ర మాజీ హోంమంత్రి మహ్మద్‌అలీ, ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ సుల్తాన్ నగర్‌లోని మహ్మదీయ మసీదు వద్ద ఎర్రగడ్డ డివిజన్ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దీనికి మాజీ హోంమంత్రి మహ్మద్‌అలీ, సికింద్రాబాద్ పార్లమెంటరీ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, హైదరాబాద్ బిఆర్ఎస్ అధ్యక్షులు, జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్, మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్‌లు దేదిప్యవిజయ్‌కుమార్, రాజ్‌కుమార్ పటేల్, మాజీ కార్పొరేటర్ శ్యామ్‌రావు ముదిరాజ్, కదీర్, జానీమియా, ఆర్షద్‌ఆలీఖాన్, అన్వర్‌ఖాన్, రహీం, బాబుజానీ, అజర్, సయ్యద్‌రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నిర్మాణ సంస్థలో బ్లాస్టింగ్..

-ఇద్దరికి తీవ్ర గాయాలు..

మూసాపేట, మార్చి 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలో ఐడిఎల్ గల్ఫ్ ఆయిల్ కార్పోరేషన్ సంస్థ ఎదురుగా గల హానరు అనే రియల్ ఎస్టేట్ నిర్మాణ సంస్థ గత సంవత్సర కాలంగా ఇక్కడ డూప్లెక్స్ విల్లాలతో పాటు బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక బండరాయిని తొలగించాలని ఉపయోగించిన శక్తివంతమైన బ్లాస్టింగ్ డిటోనేటర్ పెట్టి బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో పేలిన బండరాళ్ళు తగిలి ఇద్దరికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిసింది. గాయపడిని వాళ్ళల్లో హరిలాల్ మహంత్ (54) తీవ్రంగా గాయపడగా, పంకజ్ అల్మా (32) సాధారణ గాయాలు అయినట్లు పోలీసులు అందించిన సమాచారం ద్వారా తెలియవచ్చింది. గాయపడిన ఇద్దరిని స్థానిక అమోర్ హాస్పిటల్‌లో జాయిన్ చేసినట్లు తెలిసింది. నిర్మాణ సంస్థ గాయపడిన వారికి అన్ని రకాల ఖర్చులు, నష్ట పరిహారాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఇంటి దొంగను పట్టేసిన ఖాకీలు

వజ్రపు ఉంగరాల చోరీలో పనివాడు పట్టివేత

హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త: ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడంటారు. కానీ మూడోకన్ను లాంటి సీసీ కెమేరా నుంచి మాత్రం ఏ దొంగా తప్పించుకోలేడని మరోసారి ఋజువైంది. ఒక పనివాడు తాను చేస్తున్న ఇంటికే కన్నం వేసి వజ్రపుటుంగరాలు కాజేసిన వైనం తాజాగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే, బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12లో నివాసముంటున్న యశ్ లల్వానీ అనే వ్యాపారి ఇంట్లో బీహార్ కు చెందిన సాహెబ్ కుమార్ మూడేళ్ళుగా సర్వెంట్‌గా పని చేసున్నాడు. ఈ క్రమంలో ఇంటి యజమాని యశ్ లల్వానీ తన తల్లికోసం చేయించిన మూడు వజ్రపుటుంగరాలను బీరువాలో దాచి ఉంచాడు. సరిగ్గా పది రోజుల తర్వాత చూడగా బీరువాలో గానీ, ఆ గదిలో గానీ ఉంగరాలు కనిపించకపోవడంతో, ఇల్లంతా జలెడ పట్టాడు. ఐనా ఎటువంటి ఫలితం లేకపోవడంతో సీసీ కెమేరాని పరిశీలించిన యశ్ లల్వానీ చివరిగా వజ్రాలు దాచిన గదిలోకి వెళ్ళింది తమ పనివాడు సాహెబేనని గుర్తించాడు. ఉంగరాలు దొంగతనం అనంతరం సాహెబ్ పారిపోకుండా తమ మధ్యే ఉండడంతో విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డాడు యజమాని యశ్ లల్వానీ. తన పనివాడిపై అనుమానం వ్యక్తం చేస్తూ యశ్ లల్వానీ శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించి జరిగింది వివరించి ఫిర్యాదు చేయగా, అనూహ్యంగా పోలీసులు రంగంలోకి దిగి నిందితుడు సాహేబ్ కుమార్‌ని ప్రశ్నించారు. అతడిపి అదుపులోకి తీసుకుని ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 381కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లుగా పోలీసు అధికారులు పేర్కొన్నారు.

పట్నం సునీత మహేందర్ రెడ్డికి భారీ మెజార్టీ అందించేలా కృషి చేయాలి

-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మూసాపేట, మార్చి 29, ప్రభాతవార్త మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జీ బండి రమేష్, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, మాజీ టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలంటే, కాంగ్రెస్ అధిష్టానం నమ్మకాన్ని నిలుపుకునేలా కూకట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పట్నం సునీత మహేందర్‌రెడ్డికి భారీ మెజార్టీ అందించేలా కృషి చేయాలనీ అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కూకట్‌పల్లి తరపున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మల్కాజ్‌గిరిలో భారీ మెజార్టీ అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయడానికి పట్టుదలతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, బి.బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభ్యర్థి పత్నం సునీతను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

-ఇన్‌స్పెక్టర్‌లకు ఆహ్వానపత్రిక అందజేత

అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రామిరెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న కమిటీ సభ్యులు

అత్తాపూర్ మార్చి29,ప్రభాతవార్త : బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్‌ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లను కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు, మైలర్‌దేవ్‌పల్లి ఇన్స్పెక్టర్ మధు,అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకట్ రామిరెడ్డిలకు ఏప్రిల్ 5న అరంఘర్ చౌరస్తాలో నిర్వహించే బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకులకు రావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. అదేవిధంగా జయంతి కార్యక్రమం కోసం పోలీసుల పర్మిషన్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఇన్స్పెక్టర్‌లను కలిసినవారిలో అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు,ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం,కోశాధికారి రగడంపల్లి శ్రావణ్,పోయిల జీవన్ దాస్,జంగయ్య, సంజీవ ,బర్ల సుమన్,గోల్కొండ ఉపేందర్,ఎడ్లకాడి చంద్రశేఖర్, గౌతమ్,పోయిల వికాస్,తదితరులు ఉన్నారు.

చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి అభినందనల వెలువ

రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న తూము వినయ్ కుమార్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 29, ప్రభాతవార్త : చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తూము వినయ్ కుమార్ మాట్లాడుతూ చేవెళ్ల నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డిని ఎంపీగా ప్రజలు ఏ విధంగానైతే గతంలో గెలిపించారో అదే విధంగా ఈ సారి కూడా అధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని చేవెళ్ల ప్రజలందరినీ కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు తెల్ల హరి కృష్ణ, పుప్పాల వివేక్, చేతన్, సందీప్, నిఖిల్, విజయ్, అవినాష్, బాబు టింకు, పవన్, శ్రీకాంత్, సంతు, జయమ్మ, లక్ష్మీ, సోనాలి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యులు కేకే,మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసిన కార్పొరేటర్

కేకే, విజయలక్ష్మీలను కలిసి కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 29, ప్రభాతవార్త : సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యులు అయిన కంచర్ల కేశవావుని, ఆయన కుమార్తె జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మీని, ఖైరతాబాద్ నియోజకవర్గం శాసనసభ్యులు దానం నాగేందర్‌ని శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పోశెట్టిగౌడ్, షౌకత్‌అలీ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డి గ్రామర్ హై స్కూల్‌లో ప్రతిబింబ్ థీమ్ డే వేడుకలు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 29, ప్రభాతవార్త

ఆల్విన్‌కాలనీలోని ఎస్ఎస్‌డి గ్రామర్ హై స్కూల్‌లో స్కూల్ ఫౌండర్ సురభి రవీందర్ రావు ఆధ్వర్యంలో ప్రతిబింబ్ థీమ్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తరగతుల వారిగా మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ప్రతి విద్యార్థినిని ప్రోత్సహించి, వారికి సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఇంగ్లీష్ కాన్సెప్ట్, డాన్స్ ప్రోగ్రామ్స్, స్కిట్ ప్రోగ్రామ్స్‌లలో ఆసక్తిగా విద్యార్థులు పాల్గొన్నారు. స్టేజ్ ఫియర్, బాడీ లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్, అదేవిధంగా విద్యార్థుల సబ్జెక్టుల నుండి పలు అంశాలను తీసుకొని, వాటికి స్పీకింగ్ అండ్ డాన్స్‌ను జోడించి వినూత్న ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా వాటర్ సైకిల్, పైప్ ఎలిమెంట్, ఎలక్ట్రో మాగ్నెటిజం, జంక్‌ఫుడ్స్, సేఫ్ సాయిల్, సేవ్ గంగా, మ్యాథ్స్ మ్యాజిక్, ట్రాఫిక్ సిగ్నల్స్, ఫండమెంటల్ రైట్స్, వివిధ రకాల వృత్తులు, సోలార్ సిస్టం, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, సేవ్ బర్డ్స్ వంటి వాటి గురించి ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ వేడుకకు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రవీందర్‌రావుతో సురభి దర్గా వాణి, ప్రిన్సిపల్ సురభి తేజస్విని, ఇంచార్జీలు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ వికలాంగులకు ఫిట్‌మెంట్ అమలు అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తా

-పిఆర్‌సి చైర్మన్ ఎన్.శివశంకర్

పిఆర్‌సి చైర్మన్ ఎన్.శివశంకర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న దివ్యాంగులు

చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త: రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో వినికిలోపంతో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తానని పిఆర్‌సి చైర్మన్ ఎన్.శివశంకర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వైకల్యలోపం ఉన్న వారికి రోస్టర్ పాయింట్స్ 1 నుంచి 100, 101 నుంచి 200, 201 నుంచి 300, 301 నుంచి 400 వరకు ప్రమోషన్‌లలో రిజర్వేన్‌లు కల్పిస్తూ ఉత్తర్వులున్నాయని, అమలు చేయాలని కోరుతూ దివ్యాంగ్‌జన్ డీఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శివానందం, ఎన్.శివప్రసాద్ నేతృత్వంలో ప్రతినిధి బృందం విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎన్.శివశంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. సమస్యలను రెండవ పిఆర్‌సిలో అమలు అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. రీయింబర్స్‌మెంట్‌ను రూ.2500 నుంచి రూ.4వేలు ఇస్తూ డిగ్రీ చదువుల వరకు వర్తింపచేయాలని, ఉద్యోగుల ఆరోగ్యపథకంలో రూ.2లక్షల నుంచి రూ.50లక్షలకు పెంచుతూ పూర్తిగా వీటిని క్యాష్‌లెస్ స్కిం కింద రెఫరెల్ హాస్పిటల్స్‌కే కేటాయిస్తూ ప్రస్తుతం పిఆర్‌సిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషన్‌ను కలిసిన వారిలో సొసైటీ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, జాతీయ కోకన్వీనర్‌లు వి.భారతి, కె.వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

-బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మీనగ గోపి

హైదరాబాద్, మార్చి 29,ప్రభాతవార్త: ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ,ఎస్టీలుగా ఉన్న వాల్మీకీబోయలను తెలంగాణలోనూ బిసిలనుంచి ఎస్టీజాబితాలో చేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మీనగ గోపి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయాదవ్‌లతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా గోపి మాట్లాడుతూ గద్వాల్, వనపర్తి, మక్తల్, దేవరకద్ర , కొల్లాపూర్ నియోజకవర్గంలో వాల్మీకి బోయలు అత్యధిక సంఖ్యలో ఉన్నారని ఆసామాజిక వర్గానికి కార్పొరేషన్, ఇతర పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే అవకాశం ఉన్నచోట ఎమ్మెల్యే టికెట్లు ఒక ఎమ్మెల్సీ,రాజ్యసభ, ఎంపిలుగా ఇవ్వాలన్నారు. ఎలాంటి కులవృత్తిలేని బోయలకు రామాయణం సాక్షింగా వారిని ఆర్థికంగా ఎదగడానికి బోయ బంధు ప్రకటించి ప్రతి కుటుంబానికి 10లక్షలు

ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న సమితి ప్రతినిధులు

కేటాయించాలని అలాగే వాల్మీకి బోయ విద్యార్థుల కోసం ఐటిడిఏ గురుకులం గద్వాల్ జిల్లాలో పెట్టాలని సిఎం రేవంత్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు జింక రాజేశం, పుట్టఅంజయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులు గుజ్జుల యాదయ్య, ప్రధాన కార్యదర్శులు బోగె చందర్‌రావు, తదిరులు పాల్గొన్నారు.

1600 మంది గెస్ట్ లెక్చలర్స్‌కు 12 నెలల వేతనాలు చెల్లించాలి

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: రాష్ట్రంలోని 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 1600 మంది గెస్ట్ లెక్చలర్లకు ఆటో రెన్యువల్‌తో సర్వీస్‌ను కంటిన్యూ చేయాలని, పీరియడ్ విధానాన్ని రద్దు చేసి 12 నెలలకు కన్సాలిడేటెడ్ వేతనం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చలర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని అసోసియేషన్ తెలిపింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.కొర్ర ఈశ్వర్‌లాల్, కో-ఆర్డినేటర్ డా.బుచ్చిపాల్‌రెడ్డి, కోశాధికారి పి.నరేష్ తదితరులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తమ డిమాండ్లను అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం డిగ్రీ గెస్ట్ లెక్చలర్‌కు నెలకు 50 వేల రూపాయల వేతనంతోపాటు 12 నెలలకు కన్సాలిడేట్‌ను అమలు చేయాలని, డిగ్రీ గెస్ట్ ప్యాకల్టిలను కాంట్రాక్ట్ ఎంప్లాయీస్/పిటిఎల్/ఎంటిఎస్‌లుగా

సమావేశంలో మాట్లాడుతున్న డా.కొర్ర ఈశ్వర్‌లాల్

కన్వర్ట్ చేయాలని, ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని, అలాగే రిస్కు జరిగితే 10 లక్షల రూపాయలు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలని వారు కోరారు. ప్రస్తుతం గెస్ట్ లెక్చ లర్ల పరిస్థితి ఘోరంగా ఉందని, కనీస వేతనానికి నోచుకోక వెట్టి చాకిరికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ విషయంలో సిఎం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డా.హఫీజ్‌ఖాజా పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు సరాఫరాకు అంతరాయం

దుండిగల్, మార్చి 29 ప్రభాతవార్త: క్యాపిటల్ వర్క్‌లో భాగంగా ఆర్‌జీకే సూరారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం(30-03-2024) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి ఆర్‌జీకే-2 ఫీడర్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప సముదాయాలు, గ్రీన్‌హిల్స్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 7:30గంల నుండి 8:00గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

హెబ్రోన్‌చర్చ్‌లో ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త: ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులకు ఎంతో ప్రసిద్ధిగాంచిన హెబ్రోన్‌చర్చ్‌లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా పెద్దఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెబ్రోన్ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెసెఫ్ కురియన్, ఆర్.వీరాచారి ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు నిర్వహించిన సువ్వార్త ర్యాలీలీ గాంధీనగర్, వైజంక్షన్, జవహర్‌నగర్, ఆర్టీసిక్రాస్‌రోడ్స్ తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా జెసెఫ్ కురియన్, వీరాచారి మాట్లాడుతూ యేసుక్రీస్తు త్యాగాన్ని, ధైర్యాన్ని గుర్తు చేసుకున్నారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ, ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. క్రీస్తు త్యాగాల జ్ఞాపకంగా 'గుడ్‌ఫ్రైడే' వేడుకలను క్రైస్తవులందరు జరుపుకున్నారన్నారు. అనంతరం సువార్త ర్యాలీ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న వారందరిని భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కృషిచేసిన చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

సువార్త ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నార్సింగి, మార్చి 29 ప్రభాతవార్త : విద్యుత్ లైన్ల మధ్య మరమ్మత్తుల కారణంగా నేడు ఈ క్రింది ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఇందుకు వినియోగదారులంతా సహకరించాలని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11.కేవీ వివేకానంద ఫీడర్ పరిధిలో ఉదయం 6.గంటల నుంచి 6:30.గంటల వరకు, 11.కే.వీ.నార్సింగి ఫీడర్ పరిధిలోని నార్సింగి గ్రామం, సజ్జనార్‌సింగ్ లేఔట్, క్యూబా మసీదు కాలనీ, నార్సింగి హైట్స్, సివిఆర్ హోటల్, నార్సింగి పోలీసు స్టేషన్, ఓం కన్వెన్షన్, బాలాజీ నగర్, రుక్మీద్దీన్ కాలనీలలో కరెంటు ఉండదు. అలాగే 11.కేవీ మిలిటరీ 1.ఫీడర్ పరిధిలో ఉదయం 7.నుంచి 7:30.గంటల వరకు ఓస్‌మార్డ్ వెసెల్లా, తారామతి బారాదారి, వన్‌మోర్ నగర్, నెక్‌నాంపూర్, ఫ్లోటిల్లా అపార్టుమెంట్స్, ఇవివి కాలనీ, ఫేయిర్ ఫీల్డ్స్ కాలనీ, మార్వా టౌన్‌షిప్, ఖాస్వా ఎన్‌క్లేవ్, డ్యూస్ విల్లాస్, రాయల్ ఫంక్షన్‌హాల్, అనడ బేహిల్స్, ఆనంద కవిత్వం, అల్కాపూర్ రోడ్ నెంబర్ 28.నుంచి 30.వరకు, వాసవి కాలనీలలో కరెంటు ఉండదు. అలాగే ఉదయం 8.గంటల నుంచి 8:30.గంటల వరకు ఇబ్రహీంభాగ్ గ్రామం, వాసవీ కాలేజ్, వైఎస్సార్ కాలనీ, కోహినూర్ ఎన్‌క్లేవ్, కుతుబ్‌షాహీ ఎన్‌క్లేవ్, పాషా కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఇవివి కాలనీ, పయనీర్ ఎస్టేట్, కేజీఎన్ జిరాక్స్ రోడ్ ప్రాంతాలలో కరెంటు ఉండదని వివరించారు. అలాగే స్నేహిత హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 7.గంటల నుంచి 7:30.గంటల వరకు స్నేహితాహిల్స్, పీరంచెరువు గ్రామం, వసతి, ఆనంద్ ఇ పార్క్, భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 7:30.గంటల నుంచి 8.గంటల వరకు రఘురాం కాలనీ, ఇంద్రారెడ్డినగర్, పావని పెటెల్స్, రాధానగర్, సన్‌సిటీ ఫీడర్ పరిధిలో ఉదయం 6.గంటల నుంచి 6:30.గంటల వరకు హైదర్షాకోట్ గ్రామం, లక్ష్మీనగర్, హిమగిరి కాలనీ, శాంతినగర్ ప్రాంతాలలో కరెంటు సరఫరా ఉండదని, ఇందుకు వినియోగదారులంతా సహకరించాలని సంబంధిత శాఖ అధికారులు కోరారు.

గండిపేట మండలంలో వైభవంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

నార్సింగి, మార్చి 29 ప్రభాతవార్త : గండిపేట మండలంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని బండ్లగూడలో ఉన్న డాన్‌బాస్క్ చర్చి, కిస్మత్‌పూర్‌లోని రాక్‌చర్చి, హైదర్షాకోట్, బండ్లగూడ, నార్సింగి, నెక్‌నాంపూర్, ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలలో ఉన్న చర్చిలన్నీ వేడుకలకు హాజరైన భక్తులతో కిటకిటలాడాయి. చర్చి పెద్దలు, ఫాస్టర్లు ఏసుక్రీస్తు చూపించిన మార్గంలో పయనించి, తోటి వారికి సహాయం చేయాలని భక్తులకు ఉపదేశించారు. భక్తులంతా చర్చిలలో ఏసుక్రీస్తుకు సంబంధించిన కీర్తనలు ఆలపించారు. అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఖానాపూర్‌లోని చర్చిలో జరిగిన గుడ్‌ఫ్రైడే వేడుకలలో ఫాస్టర్ డేవిడ్ ప్రకాశ్, సునిల్‌బాబు, చర్చి అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మ, సభ్యులు కృష్ణ, బిక్షపతి, శ్రీనివాస్, ప్రకాశ్, క్రిష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ గ్రామంలోని చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకుంటున్న క్రైస్తవుల దృశ్యం.

బోరబండలో ...

గుడ్‌ఫ్రైడే సందర్భంగా బోరబండ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చ్‌లో ఏసుక్రీస్తు శిలువ మోసే ప్రదర్శనను ఇస్తున్న భక్తులు.

యూసుఫ్‌గూడ, మార్చి 29, ప్రభాతవార్త : గుడ్‌ఫ్రైడే సందర్భంగా బోరబండలోని సెయింట్ ఫ్రాన్స్ జేవియర్ చర్చ్‌లో క్రైస్తవ యూత్ సభ్యులు సంఘస్తులు కలిసి యేసుక్రీస్తు శిలువ మోసే విధానాన్ని అతను తన రక్తాన్ని చిందించి మానవ పాపాలను కడిగి శిలువపై కొట్టబడి మరణించిన విధానాన్ని కళ్ళకు కట్టినట్టుగా నాటక ప్రదర్శనతో చూపించడం జరిగింది. యేసుక్రీస్తు వారిని శిలువ వేసిన రోజు గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటారని పారిస్ ప్రీస్ట్ రెవరెండ్ ఫాధర్ శాంతమూర్తి అన్నారు. క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే రోజు ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. చర్చికి వెళ్ళి ప్రార్థనలు చేస్తారు. తాము చేసిన పాపాల నుంచి రక్షించమని వేడుకుంటారు. దైవకుమారుడైన ఏసుక్రీస్తు సాదారణ మనిషిగా భూమి మీదకు వచ్చి మనుషులు పడే కష్టాన్ని అనుభవించాడు. బైబిల్ ప్రకారం గుడ్‌ఫ్రైడే అనేది ఒక విచార కరమైన రోజు..కానీ మానవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం ప్రభువైన ఏసుక్రీస్తు ప్రాణాలను అర్పించిన రోజు...ఏసుక్రీస్తు శిలువ మీద ఏడు మాటలు పలికారని గుడ్‌ఫ్రైడే రోజు క్రైస్తవులు ప్రతి ఒక్కరు ఆ ఏడు మాటలు జ్ఞాపకం చేసుకుంటారు. తమని పాపాల నుంచి రక్షించడం కోసం ఏసుక్రీస్తు అనుభవించిన బాధను తలుచు కుంటారు. ఈకార్యక్రమంలో విక్టర్, ఎన్ విజయ్‌కుమార్, రాబిన్, జాకబ్, ఎడ్వర్డ్ జేమ్స్, జాన్ డి సూజా, ఆంటోనీ పాల్, ఆల్ఫోన్, బెంజ్‌మేన్, ఫాదర్ జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

కీలకంగా మారిన మల్కాజ్‌గిరి ఎంపి సీటు..

(మొదటి పేజీ తరువాయి)

ఇక ఇది ఇలా ఉండగ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సైతం మల్కాజ్‌గిరిపైనే ప్రత్యేక దృష్టిని సారించిందని స్పష్టం అవుతుంది. ముందుగానే మల్కాజ్‌గిరి ఎంపి బిజెపిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. అన్ని పార్టీల కన్నా ముందుగానే బిజెపి టికెట్ ఆయనకు ఖరారు కావటంతో ఆ మరుసటి రోజు నుంచే తన వ్యక్తిగత, పార్టీ పరంగ మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ మల్కాజ్‌గిరిని దక్కించుకోవటానికి పార్టీ క్యాడర్‌తో సమీక్షలు, సమావేశాలు జరుపుకుంటూ మంచి మెజార్టీతో గెలుస్తామన్న ధీమాలో బిజెపి పార్టీ శ్రేణులు ఉండి దూసుకపోతున్నారు. టికెట్ ఖారారు అయిన కొద్ది రోజులకే మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విచ్చేసి పర్యటించి రోడ్‌షో చేసి బిజెపి శ్రేణులు, ఓటర్లను, అభిమానులను ఉత్తేజ పరిచినట్లుగా చెప్పవచ్చు. బిజెపి కూడ రాష్ట్రంలో పట్టణ ప్రాంతంగ అధిక ఓట్లు ఉన్న మల్కాజ్‌గిరి నియోజకవర్గంపైనే ఆశలు పెట్టుకుని పార్టీ నాయకులు పనిచేస్తున్నట్లు చెప్పవచ్చు. సిట్టింగ్ స్థానం కాంగ్రెస్ ది అయినప్పటికీ బిజెపికి అనుకూలంగ ఉందని మల్కాజ్‌గిరిపైనే దృష్టిని వివిధ ప్రాంతాల వలస ఓటర్లు కూడ అధికంగ ఉన్నారని,పట్టణ ప్రాంతం అధికంగ ఉన్నట్లు భావించి బిజెపి అధిష్టానం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు స్పష్టం అవుతుంది. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటంతో ప్రస్తుత పరిస్థితితులు బిజెపికి అనుకూలంగ ఉన్నాయని బిజెపి భావిస్తుందని చెప్పవచ్చు. మల్కాజ్‌గిరిలో అత్యధికంగ ఓటర్లు ఉన్నందున ప్రధాని నరేంద్రమోదీని చూసి బిజెపికి అవకాశం ఇస్తారని, అనుకూలంగ ఉందని బిజెపి శ్రేణులు భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదీ ఇలా కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉండటం, కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటంతో కాంగ్రెస్, బిజెపి పార్టీలు గెలుపు కోసం ఏర్పాట్లు చేసుకుంటూ ముందుకు వెళుతున్నాయి. ఇక బిఆర్ఎస్ పార్టీ కూడ మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామన్న ధీమాలో ఉండి ప్రచారంలో ముందుకు వెళుతున్నట్లు చెప్పవచ్చు. ఇక బిఆర్ఎస్ పార్టీ విషయానికి వస్తే మాత్రం మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారని, పార్టీ ఎమ్మెల్సీలు కూడ ఉన్నట్లు, క్యాడర్, ఓటు బ్యాంకు ఉందంటూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపి సీటును కైవసం చేసుకోవటానికి అవకాశాలు ఉన్నట్లు బిఆర్ఎస్ పార్టీ భావిస్తుంది. మల్కాజ్‌గిరి ఎంపి బిఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డికి టికెట్ ఇవ్వటంతో ముందుగా ఆయన పార్టీ ఎమ్మెల్యేలను, క్యాడర్‌ను అభ్యర్థి లక్ష్మారెడ్డి కలుస్తూ అంతర్గత సమావేశాలు, సమీక్షలు,సమావేశాలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నట్లు స్పష్టం అవుతుంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో, కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటంతో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కింది స్థాయి బిఆర్ఎస్ నాయకులు నియోజకవర్గాల నాయకులు కొందరు పార్టీని వీడి బిజెపి, కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటంతో గులాబి పార్టీకి కొంత వరకు సంకటంగ మారింది. అయినా గత మాజీ సిఎం కెసిఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని, పార్టీకి మంచి పట్టు ఉందని, ఓటు బ్యాంకు ఉందని భావిస్తున్నారు. బిఆర్ఎస్ కూడ కొన్ని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి బిఆర్ఎస్‌ను గెలిపించాలని కోరటం జరుగుతుంది. ఏది ఏమైనా మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం రాజకీయంగ కీలకంగ మారి ప్రస్థానం కొనసాగుతుందని చెప్పవచ్చు.

భారీ మెజార్టీతో గెలిపించండి : బిజెపి అభ్యర్థి ఈటెల

నిజాంపేట్, మార్చి 29, ప్రభాతవార్త మల్కాజగిరి పార్లమెంట్ అభ్యర్థి మాజీ మంత్రి ఈటెల రాజేందర్ నిజాంపేట్ కార్పోరేటర్ పరిధిలో కార్పోరేషన్ అధ్యక్షులు ఆకుల సతీష్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో బాగంగా బాచుపల్లి కౌలస్య కాలనీ పార్క్, నిజాంపేట్ శ్రీరాముల కుంట పార్క్ నందు మార్నింగ్ వాక్ చేస్తున్న పౌరులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 400 పార్లమెంట్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారని దానిలో భాగంగా మల్కాజ్‌గిరి దేశంలోనే అతి ఎక్కువ ఓట్లు కలిగిన స్థానమని, ఈ స్థానం నందు తనను గెలిపించడం ద్వారా కేంద్ర ప్రభుత్వంలో మల్కాజ్‌గిరికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందని, అంతేకాకుండా మల్కాజ్‌గిరి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు కేటాయింపులు, అభివృద్ధి పనులు అమలు చేయడానికి వీలవుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిబద్ధత అధికారంలో ఉన్నా కూడా అదే నిబద్ధత

పొరుగు జిల్లాల నుంచి వస్తున్న ఆటోలను నిషేధించాలి

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: జంటనగరాలలోకి పొరుగు జిల్లాల నుంచి చట్ట వ్యతిరేకంగా వస్తున్న ఆటోలను అరికట్టడంలో నగర పోలీస్ కమిషనర్, జేటిసి ఆర్టీఏ కార్యదర్శి ఘోరంగా విఫలం చెందారని, తక్షణమే వీరిని సస్పెండ్ చేయాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఏసి కన్వీనర్ ఎండి అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొరుగు జిల్లాల నుంచి వచ్చిన ఆటోలు జంటనగరాల్లో విచ్చల విడిగా తిరుగుతున్నాయని, దీంతో స్థానిక ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక ఆనే ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరొక వైపు ప్రభుత్వం ఆర్టీసీ బస్‌లలో మహిళలకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి వర్ణించడానికి వీలు లేకుండా పోయిందని, అప్పులు తీర్చలేక డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను సిఎం తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

క్రీస్తు శిలువునెక్కిన రోజే గుడ్ ఫ్రైడే

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: జగతికి శాంతి సందేశాన్ని ఇస్తూ క్రీస్తూ శిలువునెక్కిన రోజే గుడ్ ఫ్రైడే అని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు చెప్పారు. శాంతియుత సమాజం కోసం సన్మార్గ జీవనాన్ని మానవ జాతికి తెలియజేయడం కోసమే శిలువునెక్కిన క్రిస్తు తన రక్తాన్ని చిందించిన రోజే గుడ్ ఫ్రైడే అని ఆయన వివరించారు. గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రార్థన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. క్రీస్తు బోధనలు ప్రపంచానికి మార్గదర్శకమని, ఆయన బోధనలను ప్రపంచానికి చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31న వీరశైవ లింగాయత్‌ల సమావేశం

సైఫాబాద్, మార్చి 29 ప్రభాతవార్త: వీరశైవలింగాయత్ జంగమ మహేశ్వరుల ఐక్యతో అన్ని రంగాలలో రాణించాలని విశ్వలింగాయత్ ట్రస్ట్ ఛైర్మన్ పసారం శ్రీనివాస్ చెప్పారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో లింగాయత్‌లు అత్యధికంగా జనాభా ఉన్నప్పటికి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాల్సింది చాలా ఉందన్నారు. అభివృద్ధిలో భాగంగా ఈ నెల 31న ముసారంబాగ్ మలక్‌పేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని, దీనికి తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా వధూవరుల తల్లిదండ్రులు వస్తున్నారని, ఈ అవకాశాన్ని వీరశైవలింగాయత్ జంగమ మహేశ్వరులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన మీడియా సమావేశంలో విజ్ఞప్తి చేశారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

అన్ని ప్రభుత్వశాఖలు అవినీతి మయం

-ఆల్‌ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్స్ సునామీ పార్టీ అధ్యక్షుడు భూపాల్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 29, ప్రభాతవార్త: దేశంలో, రాష్ట్రంలో అన్నిప్రభుత్వ శాఖలల్లో అవినీతి తాండవమాడుతుందని ఆల్‌ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్స్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షులు సిహెచ్.భూపాల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ అవినీతిని నిలువరించడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రెవిన్యూ మైనింగ్ శాఖలలో చిన్నస్థాయి ఉద్యోగులు సైతం లంచగొండులుగా పట్టుబడ్డ వైనాలు కోకొల్లలుగా చూశామని అన్నారు. స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో లంచాలు లేకుండా పనులు జరగట్లేదని వాపోయారు. ఈఅవినీతి పరులు రాజ్యాధికారులుగా ఉంటేదేశ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. అలాగే తాజాగా బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ నేత కేశవరావుపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేశవరావు ఆంధ్రప్రాంతానికి చెందిన కాపు అని ,తెలంగాణలో బిసి అని చెప్పుకుంటూ తిరుగుతున్నాడన్నారు. ముఖ్యంగా తెలంగాణ కాంగ్రెస్‌లో అంధ్రుల జోక్యం ఎక్కువైందని విమర్శించారు.

రమేశ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

-బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త: వాటర్‌వర్క్స్ ఉద్యోగి సిహెచ్.రమేశ్‌పై దాడి చేసిన వ్యక్తిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బిఆర్‌టియు) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాద్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని బిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వర్కింగ్‌ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. వాటర్‌వర్క్స్ మాదన్నపేట సెక్షన్‌లో పనిచేస్తున్న సిహెచ్.రమేశ్‌పై బఉధవారం రెయిన్‌బజార్‌కు చెందిన ఓ వ్యక్తి దాడి చేశారని తెలిపారు.ఇదిలా ఉండగా బాధితుడి పక్షాన నిలబడాల్సిన బాధ్యత యూనియన్ నాయకులపై ఉంటుందని, కాని ఐఎన్‌టియుసి అనుబంధంగా ఉన్న జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు సతీష్ మాత్రం దాడి చేసిన వ్యక్తిని తప్పించే విధంగా రాజీ కుదిర్చే విధంగా చర్యలకు ఉపక్రమించడం దారుణమన్నారు.దాడి చేసిన వ్యక్తిని అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ అడ్మిషన్లను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా చేపట్టాలి

-బిసి విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్

విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న వేముల రామకృష్ణ తదితరులు

హైదరాబాద్, మార్చి 29,ప్రభాతవార్త: రాష్ట్రంలో కార్పొరేట్ ఇంటర్ కాలేజీల అడ్మిషన్ల దందాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అలాగే ఆన్లైన్ ప్రక్రియ ద్వారా ఇంటర్ అడ్మిషన్లు చేపట్టాలని బిసి విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం విద్యానగర్‌లోని బిసిభవన్ వద్ద పలువురు విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరానికి రెండున్నర నెలల సమయం ఉన్నప్పటికీ కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పటికే 90శాతంపైగా అడ్మిషన్లు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ముఖ్యంగా ఇంటర్ బోర్డు అధికారులు రెండుమూడు కార్పొరేట్ విద్యాసంస్థ చేతుల్లో కీలుబొమ్మలుగా మారి వారికి వంతపాడుతున్నారనిఆరోపించారు. ఒకబ్రాంచికి పర్మిషన్ తీసుకుని ఆదేపేరుపై వందలాది బ్రాంచిలు పెట్టి విద్యార్థులు వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అధిక ఫీజుల చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా వారివద్ద డబ్బులు వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వమైనా అక్రమంగా చేపట్టిన అడ్మిషన్లు రద్దు చేసి ఇంటర్‌బోర్డు పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి పేద ఎస్సీ,ఎస్టీ,బిసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు వినోద్, వంశీ, హరీష్, శేఖర్, రఘు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొంపల్లి, మార్చి 29, ప్రభాతవార్త : నేడు విద్యుత్ మరమ్మతుల పనుల కోసం 11కెవి ఫీడర్‌ల కారణంగా ఉదయం 7:30 గంటల నుండి 8 గంటల వరకు అపర్ణ ఫామ్ గ్రోవ్, వెంకటేష్ వారకాలనీ, దేవేందర్ కాలనీ, మికాసా స్టెర్లింగ్, అమర్ రోడ్డు, సెంట్రల్ పార్క్ కమాన్ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేయబడుతుందని ఇందుకు ప్రజలు సహకరించాలని టిఎస్ఎస్‌పిడిసిఎల్ శాఖకు సహకరించాలని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

పారుశుద్ధ్య మహిళా సిబ్బందికి అన్నం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న తలారి శ్రీనివాస్ రావు

తార్నాక, మార్చి 29 ప్రభాతవార్త: సామాజిక న్యాయానికి బాటలు వేసిన పార్టీ టీడీపీ అని చంద్రబాబునాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఒ.యూ పీహెచ్‌డీ విద్యార్థి తలారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఓ.యూ ఆర్ట్స్ కాళాశాల ఎదుట తెదేపా 42 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తలారి శ్రీనివాస్ రావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక పారుశుద్ధ్య కార్మికులకు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేసిన అనంతరం తలారి మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అమలు చేసిన నేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒ.యూ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శివ శంకర్, బీసీ సెల్ సీటీ ఉపాధ్యక్షుడు మంద వెంకట స్వామి, ముద్ద గణేష్, కోటేశ్వర రావు, చప్పిడి గోపి, సిహెచ్.వీరబాబు, ప్రభాకర్, మాదిగ, బాలేబోయిన గోపి గౌడ్, ఐతన బోయిన గోపి ముదిరాజ్, రాజు, అనిల్, రాము విద్యార్థులు పాల్గొన్నారు.

కెపిహెచ్‌బి డివిజన్‌లో

కెపిహెచ్‌బి కాలనీలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల దృశ్యం

మంగళవారం చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వీధిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం దినోత్సవం

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 29, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని, కెపిహెచ్‌బి డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రమ్య గ్రౌండ్ వద్ద దివంగత నేత నందమూరి తారకరామారావు విగ్రహానికి టిడిపి శ్రేణులు శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తెదేపా కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు షేక్ సత్తార్, అట్లూరి దీపక్, వేములపల్లి రాజా, శివసత్యనారాయణ, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, జాస్తి రమాదేవి, గోపి కృష్ణ, చంద్రరావు, శ్రీను, కట్ట నరసింగరావు, ఆనందరావు, సాంబశివరావు, పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో ...

చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త: తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని తెలుగుదేశం పార్టీ టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వీధిలో పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్క రించుకుని పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ రామ్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోమోహన్‌గౌడ్, పి.శివకృష్ణ, ఉదయ్‌గుప్త, గోపాల్, సుబ్బారావు, గౌతమ్, శంకర్, అన్నపూర్ణ, వీణ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పార్లమెంట్‌ను అన్ని వాధాలుగా అభివృద్ధి చేశా

-తార్నాకలో విస్తృతంగా ఆపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమైన మంత్రి కిషన్ రెడ్డి

తార్నాక, మార్చి 29 ప్రభాతవార్త : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాన్ని అన్ని వాధాలుగా అభివృద్ధి చేశానని మరో సారి ఆశీర్వదించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తార్నాకలోని ఎస్ఎస్ హైట్స్, కళాకృతి, శ్రీకర్ శ్రీవాస్ అపార్ట్‌మెంట్స్ వాసులతో ఆయన వేరు వేరుగా సమావేశమై ప్రధాని మోడి పాలనను మరో సారి ఆశీర్వదించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బిజేపిని మహిళలు ఎంతో ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోది కృషితో వందలాది కోట్ల వ్యయంతో బేగంపేట్ ఏయిర్‌పోర్టు అభివృద్ధికి శంకుస్థాపన చేశారని, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి, 4 వందేభారత్ ట్రైన్లను తెచ్చారని, ఎంఎంటీఎస్ మూడో దశపనులను పూర్తి చేశామని, చర్లపల్లి టర్మినల్ అభివృద్ధితో పాటు త్వరలో నగరానికి రీజనల్ రింగ్ రోడ్డు రాబోతుందని చెప్పారు. ఇంకా అభివృద్ధి కోసం మరో సారి బిజేపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో ఎప్పుడు 40 శాతం ఓటింగ్ ఉండదని అందరం ఓటుపై దృష్టి సారించాలని సూచించారు. దేశ భవిష్యత్ కోసం ఓటు వేయాలని పేర్కొన్నారు. అవినీతి రహిత పాలనందిస్తున్న మోది ప్రభుత్వం అనేక సంస్కరణలను చేపట్టిందన్నారు.శాంతి భద్రతలు, దేశ భద్రత మౌలిక వసతుల ఏర్పాటుకోసం బిజేపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు.మహిళలకు 33 శాతం రిజర్వేషన్, ముస్లీం మహిళల కోసం త్రిపుల్ తలాఖ్ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. 50 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ కేవలం 10 ఏళ్లలో 12 లక్షల కోట్ల ఆవినీతి చేసిందని ఆరోపించారు. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు చెప్పిందని కాగ్ రిపోర్ట్ ఇచ్చినటువంటి పరిస్థితి మనకు కనిపిస్తుందన్నారు. గతంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఐఎస్ఐ సంస్థలు ఉగ్ర సంస్థలు మన బస్తీల్లో,

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సన్మానిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

మన నగరంలో ఏ విధంగా బలపడ్డాయో మనందరికి తెలుసునన్నారు. గూకుల్ చాట్, లుంబిని పార్క్ లాంటి ప్రదేశాల్లో మన బిడ్డల్ని పొట్టన పెట్టుకున్న విషయం మనందరికి తెలుసునన్నారు. శ్రీకర్ శ్రీవాస్ అపార్ట్‌మెంట్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి, నాయకులు శ్యామ్‌సుందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణి, ప్రభుగుప్త, రవిప్రసాద్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, పోచయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి మల్లింటి వీరన్న,కొన్నె సంపత్, సందీప్ రాజ్, కనకట్ల హరి, శారద మల్లేశ్, రామువర్మ, ఉపేందర్ యాదవ్, నరేష్, గునిగంటి కేధారి, అపార్ట్‌మెంట్ వాసులు శాస్త్రీ, శ్రీనివాస్,శ్రీహరి, ఏఆర్.ప్రసాద్, కేవి.రావు, శ్రీదేవి, రమాదేవితో పాటు పలువురు పాల్గొన్నారు.

సాహితీవేత్తలు భవిష్యత్ దర్శనం చేయాలి

-శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, మార్చి 29 ప్రభాతవార్త: సాహితీవేత్తలు వర్తమాన సంఘటనలపై స్పందించటమే కాక భవిష్యత్తు దర్శనం చేసి రచనలు చేయాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మనిషిలో దైవత్వాన్ని చుడటమే తన సాహితీ ప్రక్రియల లక్షణం అని చెప్పారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ద్రావిడ విశ్వవిద్యాలయం(కుప్పం) వైస్‌చాన్స్‌లర్, రచయిత్రి ఆచార్య కొలకలూరి జ్యోతి రచించిన 'ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య సృష్టి' గ్రంథావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ప్రొఫెసర్ శ్రీనివాస్, గానసభ పాలకవర్గ సభ్యుడు తాళ్ళపల్లి చక్రపాణి, గానసభ కమిటీ సభ్యుడు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తన సాహితీసేధ్యం కథ వ్యాసం నాటకం అనువాదం కవిత్వం నవల, విమర్శ ఇలా ఏడు ప్రక్రియలుగా సాగిందన్నారు. మధుజ్యోతి ఏడు ప్రక్రియలుపై లోతైన అధ్యాయం చేసి పరిశోధనకు సరిపడా విశ్లేషణ తన గ్రంథంలో చేశారన్నారు. ప్రజాస్వామ్యం అనే సంపుటిలో తాను తక్కువ శాతం వచ్చిన పార్టీ అధిక శాతం ప్రజలను పాలించటంపై రాశానని అన్నారు. నేడు ఎన్నికలలో కొన్ని మార్పులు ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేని వారికి కూడా ఓటు

ఆచార్య కొలకలూరి జ్యోతి రచించిన 'ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య సృష్టి' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, చిత్రంలో కళావిఎస్.జనార్దనమూర్తి తదితరులు

హక్కు వినియోగించుకునే విధానం వచ్చిందని, ఇందువల్ల అధికశాతం ఓటింగ్ నమోదు అయ్యే అవకాశం కలిగిందన్నారు. గ్రంథ రచయిత మధుజ్యోతి మాట్లాడుతూ ఇనాక్ సాహిత్యం సమస్తం ప్రేమతత్వంతో ముడిపడి ఉంటుందన్నారు. వేర్వేరే సందర్భాలలో వేర్వేరుగా ఆభావాలు వ్యక్తమవుతాయన్నారు. స్త్రీ హక్కులు స్వేచ్ఛ గురించి ఎవరూ మాట్లాడని రోజుల్లో ఏభై దశాబ్దాలు క్రితమే ఇనాక్ తన సాహిత్యంలో వాటి గురించి ప్రస్తావన చేశారని మధుజ్యోతి గుర్తు చేశారు.

ఇన్‌స్పెక్టర్ వేధింపులు అపకుంటే ఆత్మహత్య చేసుకుంటా...

యూసుఫ్‌గూడ, మార్చి 29, ప్రభాతవార్త : మధురానగర్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ వేధింపులు ఆపకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటా అంటూ యోగా మాస్టర్ శ్రీనువాస్ తన ఇంట్లో పెట్రోల్ డబ్బాతో నిరసనకు దిగాడు. ఓ ఇంటి విషయంలో తనను వేధిస్తూ రౌడీలకు వత్తాసు పలుకుతున్నాడని యోగా మాస్టర్ శ్రీనువాస్ ఆరోపించారు.తనకు పోలీసులు అన్యాయం చేయాలని చూస్తే తనకు చావే గతి అనీ వాపోయాడు.స్థానికులు వెంటనే అతన్ని నచ్చచెప్పి ఎలాంటి అగాయిత్యానికి పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పాలలో విషం ఇచ్చి భర్తను హత్యను చేసిన భార్య

మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 29 ప్రభాతవార్త : ఓ భార్య కట్టుకున్న భర్తకు పాలలో విషం ఇచ్చి హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ డిఐ తిమ్మప్ప కథనం ప్రకారం...బిహార్ రాష్ట్రానికి చెందిన అవినాష్ సింగ్ (35) బతుకు దెరువు కోసం కొంత కాలం క్రితం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్‌కు వచ్చాడు. భార్య ఆకాంక్ష (26)తో కలిసి బాబుల్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్నాడు.అవినష్ సింగ్,ఆకాంక్షలకు కొడుకు,కూతురు కలరు.కాగా భార్యా భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి.భర్తను చంపాలని నిర్ణయానికి వచ్చిన భార్య ఆకాంక్షపథకం పన్నింది.ఈ పథకంలోనే భాగంగానే భార్య ఆకాంక్ష గురువారం రాత్రి భర్త అవినాష్‌సింగ్‌కు పాలలో విషం కలిపి ఇచ్చింది.విషం కలిపిన పాలు త్రాగటంతో భర్త మృతి చెందాడని పోలీసులు తెలిపారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిని ఎయిర్ గన్‌తో బెదిరించిన ఇద్దరు యువకులు అరెస్ట్

చార్మినార్,మార్చి 29 ప్రభాతవార్త : పాతబస్తీలోని ఓ పెట్రోల్ బంక్ సిబ్బందిని ఎయిర్‌గన్‌తో బెదిరించిన సంఘటనలో మీర్‌చౌక్ పోలీసులు శుక్రవారం ఇద్దరుయువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.విలేకర్ల సమావేశంలో మీర్‌చౌక్ ఎసిపి వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.పాతబస్తీ అలీజాకోట్లకు చెందిన బక్షి అలీ జైదీ (24),గంగానగర్‌కు చెందిన మహ్మద్ అర్షాద్ (25)లు కలిసి ద్విచక్ర వాహనంపై ఈ నెల 27వ తేదీ బుధవారం సాయంత్రం పాతబస్తీలోని మీర్‌చౌక్ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకోవటానికి వెళ్లారు.పెట్రోల్ కోసం వరుసలో నిలబడాలని పెట్రోల్ బంకు సిబ్బంది ఇద్దరు యువకులకు సూచించారు.కాగా బక్షి అలీ జైది ఎయిర్ గన్‌తో పెట్రోల్ బంకు సిబ్బందిని బెదిరించాడు.ఈ కేసులో మీర్‌చౌక్ పోలీసులు శుక్రవారం బక్షి అలీ జైది,మహ్మద్ అర్షాద్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును మీర్‌చౌక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కృష్ణమూర్తి

ఆఫ్జల్‌గంజ్,మార్చి 29ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి,రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్,టిపిసిసి వర్కింగ్ అధ్యక్షులు మహేష్ గౌడ్‌ల సమక్షంలో ఖమ్మం జిల్లా వైరాకు చెందిన బిఆర్ఎస్ కోర్డినేటర్ బి. కృష్ణామూర్తి కాంగ్రెస్‌పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ కో ఆర్డినేటర్‌బోయినిపల్లి కృష్ణామూర్తి

తెలంగాణ సగర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

-అఖిలభారత సగర మహాసభ అసలైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రసాగర్

ప్రసంగిస్తున్న అఖిలభారత సగర మహాసభ అసలైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రసాగర్

చిక్కడపల్లి,మార్చి 29 ప్రభాతవార్త: తెలంగాణ సగర ఫెడరేషన్‌ను మార్చి ఇతర కులాలకు కేటాయించిన విధంగా సగర కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని నియమించాలని అఖిలభారత సగర మహాసభ అధ్యక్షుడు శన్‌శెట్టి విజయేంద్రసాగర్, ప్రధాన కార్యదర్శి రాచకొండ హనుమంత్ సాగర్, కోశాధికారి ఛాతిరి పార్థసారథి సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి కమ్యునిటీ హాల్‌లో అఖిలభారత సగర మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయేంద్రసాగర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మహాసభ ప్రతినిధులు రాజేశ్‌సాగర్, శ్యామ్‌సాగర్, శ్రీనివాస్‌సాగర్, విజయకుమార్‌సాగర్, సుధాకర్ సాగర్, నర్సింగరావు సాగర్, మంజుల సాగర్, శైలజాసాగర్, వేణుగోపాల్ సాగర్, కార్యవర్గసభ్యులు పాల్గొని మాట్లాడుతూ.. అఖిలభారత సగర మహాసభ పేరుతో ఉన్నది అసలైన సంఘం అని, ఇటీవలి కాలంలో అఖిలభారత సగర మహాసభలో కొందరు తమ కార్యక్రమాలు చూసి గిట్టనివారు కార్యవర్గం అనుమతులు లేకుండా సమావేశం నిర్వహించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యవర్గం అనుమతులు లేకుండా సమావేశం నిర్వహించి కులప్రతిష్టను దిగజార్చిన వారిపై చట్టపరంగా, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సగర క్షత్రియ చారిటబుల్‌ట్రస్ట్‌కు చైర్మన్‌గా గణపతి ప్రకాశ్‌రావు సాగర్ 20 సంవత్సరాల నుంచి కొనసాగుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద సగరులకు ఎలాంటి సహాయ సహకారాలను అందించడం లేదని, సగర విద్యానిధి సంఘం అధ్యక్షుడిగా ముత్యాల హరికిషన్‌సాగర్, కమిటీ కూడా 8 సంవత్సరాల నుంచి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా కుంటుపడేశారన్నారు. ఈ రెండు కమిటీలకు నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని తీర్మాణించారు.

నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్,మారినచ 29 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 30వ తేదీ శనివారం ఉదయం 6.30 గంటలు నుంచి 7 గంటలు వరకు జనప్రియ కాలనీ,జనప్రియ అపార్టుమెంట్ ప్రాంతాలలో,చౌక్,బండిఅడ

పెరుగుతున్న హోల్‌సేల్ పండ్ల వ్యాపారస్తులు ఆగడాలు

భయాందోళనలో కాలనీవాసులు - రోడ్లపై వ్యాపారాన్ని నిషేధించాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న కార్పొరేటర్, నాయకులు, కాలనీవాసులు

ఎల్.బి.నగర్, మార్చి 28 ప్రభాతవార్త: నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై హోల్‌సేల్ వ్యాపారం చేయడమే కాకుండా ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడికి పాల్పడుతున్న హోల్‌సేల్ పండ్ల వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని నాయకులు, కాలనీవాసులు డిమాండ్ చేశారు. చైతన్యపురి డివిజన్ అయ్యప్ప మెడికల్‌షాప్ నుంచి చైతన్యపురి పోలీస్‌స్టేషన్, కొత్తపేట మహాలక్ష్మి థియేటర్ సర్వీసు రోడ్డు, జాతీయ రహదారులపై హోల్‌సేల్ పండ్ల వ్యాపారస్తులు విచ్చలవిడిగా తమ వ్యాపార కార్యకలాపాలు కొనసాగించడం వల్ల వాహన చోదకులు, కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గతంలో పోలీసులకు, జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి నుంచే పెద్ద లారీలు, డీసీఎం, ట్రాలీఆటోలు వందలాది సంఖ్యలో రోడ్లపై పెట్టి హోల్‌సేల్ పండ్ల వ్యాపారం చేస్తున్నడంతో సర్వీస్ రోడ్డుతో పాటు జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడంలేదని కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలతో పాటు ప్రభాత్ నగర్, మారుతినగర్ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ప్రజలు గురువారం ఆందొళన చేపట్టారు. గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ తరలించడంతో చాలా మంది హోల్‌సేల్ వ్యాపారులు ప్రభాస్‌నగర్, మారుతినగర్, సాయినగర్, సత్యనారాయణపురం జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్‌రోడ్లనే అడ్డాగా చేసుకుని యదేచ్ఛగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం సమయంలో విద్యార్థిని విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో వ్యాపారస్తులు నిలిపిన పండ్ల వాహనాలతో తీవ్రట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో విద్యార్థులు పరీక్షలకు హాజరు కావడానికి వెళ్తున్న సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి వ్యాపారం చేస్తున్న వారిని తొలగించాలని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై వ్యాపారస్తులు అంతా ఏకమై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని కాలనీవాసులు ఆందొళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై పండ్ల వ్యాపారం చేయడమే కాకుండా ప్రశ్నిస్తున్న వారిపై దాడులు చేయడం బెదిరింపులకు పాల్గొనడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను ఆక్రమించిన వ్యాపారస్తులు మహిళలు, విద్యార్థులు, బాలబాలికలు రోడ్డుపై నడిచే సమయంలో ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మెట్రో కారిడార్లు మొత్తం ఆక్రమించి బహిరంగంగా పొగ తాగడం, మద్యం సేవించడం, మూత్ర విసర్జన చేయడం, గుట్కా నములుతూ దారి వెంట వెళ్లే మహిళల వట్ల వెకిలి చూపులు చూస్తూన్నారని, బాల కార్మికులతో పనిచేస్తున్నారని తెలిపారు. కాలనీ కార్యకలాపాలలో చురుగ్గా ఉండే వ్యక్తుల ఫోటోలు, వీడియోలు తీస్తూ అరుస్తూ గొడవ పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ కాలనీ పరిసర ప్రాంతాల్లో భయాందొళన సృష్టిస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత గుర్తింపులు లేకుండా, అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్న వ్యక్తులు స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతున్న హోల్సేల్ వ్యాపారాలను రోడ్లపై నిషేధించే విధంగా ప్రబుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల నాయకులు కాలనీవాసులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు చైతన్యపురి కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా, తోట మహేష్‌యాదవ్, బండ సురేందర్‌రెడ్డి, రమణారెడ్డి, రుద్రారపు శంకర్, ఎస్.నాగలక్ష్మి, వెంకట్‌రమణ, వినోద్‌యాదవ్, కృషప్రకాష్, సుభాష్‌చంద్రబోస్, రాజగోపాలన్, బాలిరెడ్డి, నర్సింహారావు, గౌడా, అర్జున్‌సింగ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

మత సామరాస్యానికి ప్రతీక ఇఫ్తార్ వేడుకలు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 29 ప్రభాతవార్త : రంజాన్ వేడుకలు మత సామరాస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ గణేష్‌నగర్‌లో ముస్లిం, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరు ఇఫ్తార్ వేడుకలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు అనందోత్సవాలతో వేడుకలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఖాదర్ పాషా, ఖాదర్ వలీ, మస్తాన్ వలీ, ఖాజావలీ, అబ్దుల్ సత్తార్, షేక్ భాషా, రాన్‌భాషా, దస్తగిరి, నాయబు రసూల్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ శుభం కన్వెన్షన్‌లో నిర్వహించిన ఎల్.బి నగర్ అసెంబ్లీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ రామచంద్రరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. (ప్రభాతవార్త, వనస్థలిపురం)

సోదరభావంతో మెలగాలి : పాస్టర్ ప్రభుచరణ్

సమావేశంలో ప్రసంగిస్తున్న చర్చి పాస్టర్ ప్రభుచరణ్

మలక్‌పేట, మార్చి 29 ప్రభాతవార్త: ప్రజలు సోదరభావంతో మెలగాలి మూసారాంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, పాస్టర్ ప్రభుచరణ్, చర్చి పాస్టర్ వన్య ఇమ్మాన్యూయేల్ పేర్కొన్నారు. క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో వారి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రై డే సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమ, కరుణ, ఆనందాన్ని నింపిన ఏసు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. యేసు సిలువపై పలికిన ఏడు మాటలను భక్తులకు వివరించారు. అదే విధంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గీతాలు ఆలపించారు.

స్పెల్ బీ క్విజ్ పోటీల్లో సత్తా చాటిన మీర్‌పేట్ నారాయణ విద్యార్థులు

బహుమతులు, ప్రశంసాపత్రాలను అందుకున్న నారాయణ విద్యార్థులు

సరూర్‌నగర్, మార్చి 29 ప్రభాతవార్త: నారాయణ స్పెల్ బీ క్విజ్ పోటీల్లో మీర్‌పేట్ బ్రాంచి నారాయణ విద్యార్థులు సత్తా చాటి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. వనస్థలిపురంజోన్ నారాయణ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న మీర్‌పేట్ నారాయణ హై స్కూల్‌కు చెందిన 9వ విద్యార్థులు సాయి సుజిత్, బి.రుతి ఫ్రక్‌లు ప్రథమ బహుమతులను, పల్లవి, వైష్ణవి, సాయి నిఖిల్, శ్రేష్ట, త్రిజల్, పుష్పహాస్‌లు ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వారు నారాయణ డిజిఎం గోపాల్ రెడ్డి, ఎజిఎం రవీందర్‌బాబు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కాగా స్పెల్ బీ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన మీర్‌పేట్ బ్రాంచి నారాయణ విద్యార్థులను ప్రిన్సిపాల్ బాబ్జి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్రాంచి విద్యార్థుల్లో పోటీతత్వం ఉందనీ ఏ పోటీల్లోనైనా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారని స్పష్టం చేశారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు : ఇజ్రాయిల్

సమావేశంలో ప్రసంగిస్తున్న పాస్టర్ శ్యాంకుమార్, చిత్రంలో పాస్టర్ సాల్మన్

మలక్‌పేట, మార్చి 29 ప్రభాతవార్త: దిల్‌సుక్‌నగర్ బాప్టిస్టు చర్చిలో చర్చి అధ్యక్షుడు విఎస్ ఇజ్రాయిల్ అధ్యక్షతన ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. చర్చిలో భక్తులు పెద్దఎత్తున విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా చర్చిపాస్టర్ బోడ సాల్మన్, అసోసియేట్ పాస్టర్ శ్యాంకుమార్, అధ్యక్షుడు విఎస్ ఇజ్రాయిల్ తదితరులు మాట్లాడుతూ శాంతి, కరుణ, సహనం, ప్రేమ విలువలను యేసు ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. యేసు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో బాప్టిస్టు చర్చి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పట్నం సునీత మహేందర్‌రెడ్డికే తమ మద్దతు

కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంత్‌రావు

నేరేడ్‌మెట్, మార్చి 29 ప్రభాతవార్త: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డికి తమ మద్దతు ఉంటుందని యునైటెడ్ కాలనీస్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీతమహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ మల్కాజిగిరి పూర్తిస్థాయిలో అభివృద్ధికావాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బి.ఆర్.ఎస్ పార్టీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవడం జరిగిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, అసోసియేషన్ అధ్యక్షులు చుంకు శ్రీనివాస్, కార్యదర్శి లోహిత్ రెడ్డి, వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్, మార్చి 29 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ బి.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉప్పల్ భగాయత్ 11 కెవి పీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు సరస్వతి కాలనీ, ఆర్‌టిఏ ఆఫీసు, మెట్రో షాపింగ్ మాల్, ఎస్‌విఎం గ్రాండ్, నాగోల్ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. అదే విధంగా హెచ్ఎండిఏ పరిధిలోని ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

హబ్సిగూడలో... హబ్సిగూడ స్నేహపురికాలనీ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ రాంరెడ్డి తెలిపారు. హబ్సిగూడ స్నేహపురికాలనీ పరిధిలో ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు, అదే విధంగా విఎస్‌టి కాలనీ, శ్రీనగర్ కాలనీ, భవానీనగర్, నాచారం రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

వ్యాపార లైసెన్స్‌లు పునరుద్ధరించుకోవాలి

రెన్యూవల్ లైసెన్స్‌ను వ్యాపారికి అందజేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది....

తుర్కయంజాల్, మార్చి 29 ప్రభాతవార్త: 2024-25 ఆర్థిక సంవత్సర వ్యాపార లైసెన్స్‌లు ఈ నెల 31వ తేదీ లోపు పునరుద్ధరించుకోవాలని (రెన్యువల్) తుర్కయంజాల్‌మున్సిపాలిటీ కమీషనర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1 వ తేదీ తర్వాత రెన్యువల్ చేసుకుంటే 25% పెనాల్టీ విధించబడుతుందని, వ్యాపారస్తులు మార్చి 31 వ తేదీలోపు రెన్యువల్ చేసుకోవాలన్నారు. శుక్రవారం స్వచ్ఛందంగా కార్యాలయంకు వచ్చి రెన్యువల్ చేసుకున్న మల్లిఖార్జున టైల్స్, డక్కన్ బావార్చి, శ్రీసాయి మోటార్స్, న్యూ బెస్ట్ బావార్చి, తులిప్స్ హోటల్, ఇమామి గోడాన్స్, శ్రీనివాస ఫుడ్ ప్రోడక్ట్స్ వారిని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, భానుమతి, మల్లారెడ్డి, మున్సిపాలిటి సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేస్తున్న టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు (ప్రభాతవార్త, తుర్కయంజాల్)

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వమే దేశానికి శరణ్యం : ఈటల రాజేందర్

సమావేశంలో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

ఎల్.బి.నగర్, మార్చి 29 ప్రభాతవార్త: దేశ సంరక్షణ అభివృద్ధి మోడీతోనే సాధ్యం అవుతుందని మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశం నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పలు దేశాలకు ఆర్థిక సహాయం చేసే స్థాయిలో భారతదేశాన్ని అభివృద్ధి చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. గత కాంగ్రెస్ ప్రబుత్వ హాయంలో అవినీతి కుంభకోణాలతో దేశాన్ని దివాలా తీయించారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు మాట్లాడుతూ గతంలో ఇక్కడ నుంచి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి ఏం చేశాడని ప్రశ్నించాడు. దేశంలో 140 సంక్షేమపథకాలు అమలు చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు సామ రంగారెడ్డి, శ్రీనివాసులు, పాతూరి కరుణ, గోలి మధుసూదన్‌రావు, వేణుగోపాల్, కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు చింతల అరుణా సురేందర్ యాదవ్, నాయకోటి పవన్ కుమార్, రంగ నరసింహ గుప్తా, బద్ధం ప్రేమ మహేశ్వర్ రెడ్డి, వంగా మధుసూదన్ రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిఫెన్స్ కాలనీలో బూత్‌స్థాయి కమిటీ సమావేశం

బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు..

నేరేడ్‌మెట్ మార్చి29 ప్రభాతవార్త: మల్కాజిగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డికి మద్దతుగా నిలిచి ఆమెకు భారీ మెజార్టీని అందించాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు. శుక్రవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ రామాలయం ఏర్పాటు చేసిన బూత్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎంపీఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని అత్యధికఓట్లతో గెలిపించాలని తీర్మానించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే తెలంగాణ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్సార్ ప్రాద్, వెంకటేష్ యాదవ్, లక్ష్మికాంత్, బి.కె శ్రీనివాస్, ఇందిరా, చంద్రశేఖర్, చెన్నారెడ్డి, రాజలింగం, కుట్టిసీను, రాఘవన్, గోకుల్ చిత్ర, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యేసు జీవితం మానవాళికి ఆదర్శం : సామ్యూల్‌బాబు

సమావేశంలో ప్రసంగిస్తున్న పాస్టర్ సామ్యూల్ బాబు

మలక్‌పేట, మార్చి 29 ప్రభాతవార్త: యేసు జీవితం మానవాళికి ఆదర్శమని పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ బాబు పేర్కొన్నారు. మూసారాంబాగ్ కృష్ణ తులసినగర్‌లోని బేతానియా బాప్టిస్టు చర్చిలో పాస్టర్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే సాడ్ ఫ్రైడే కాదని, శుభ శుక్రవారమని పేర్కొన్నారు. యేసు శిలువను ఎక్కి తమ ప్రాణాలను విడిచిపెట్టిన రోజని వివరించారు. ప్రతిఒక్కరూ ఇతరులపై దయాగుణం కలిగి ఉండాలన్నారు. యేసు సిలువపై పలికిన ఏడు మాటల గురించి దేవేంద్రప్ప వీరపురం, తేజస్వీప్రసాద్‌రెడ్డి ప్రోగు, సునితబాబు, జాన్ మోజోస్ కోడూరి, సుధీర్‌కుమార్ బండారు, రమేష్‌బాబు తదితరులు వివరించారు. అదే విధంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ల్యాంబ్ చర్చిలో గుడ్ ఫ్రై డే వేడుకలు

గుడ్ ఫ్రై డే వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

వనస్థలిపురం, మార్చి 29 ప్రభాతవార్త: వనస్థలిపురం లిటిల్ ల్యాంబ్ చర్చిలో గుడ్ ఫ్రై డే వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా పలువురు పెద్దలు పాస్టర్ సిలువపై ఉన్నప్పుడు యేసు పలికిన ఏడు మాటలను క్రైస్తవ సోదరులకు బోధించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ల్యాంబ్ చర్చి ఫాస్టర్ రెవరెండ్ కె.సురదర్శన్‌రావు, చర్చి కమిటీ సభ్యులు టిఎస్ బాబురావు, జార్జ్ ముల్లర్, భానుకిరణ్, ఎన్.జాన్, సురేష్‌కుమార్, రఘురాం, జాకబ్ ప్రసాద్, విజయలక్ష్మి, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి

మహిళా సమావేశంలో మాట్లాడుతున్న ఈటెల జమున

కుషాయిగూడ, మార్చి 29 ప్రభాతవార్త : మోడీని మరోసారి ప్రధాని చేయడానికి బిజెపి ఎంపీ అభ్యర్థులను అధికమెజార్టీతో గెలిపించాలని బిజెపి మహిళా మోర్చావ అధ్యక్షురాలు శశికళ కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్. బి కాలనీ ఫోర్త్ డివిజన్ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శశికళ ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికల విషయమైనా బిజెపి మల్కాజిగిరి అభ్యర్థి ఈటెల రాజేందర్ సతీమణి ఈటెల జమున దిశా నిర్దేశ సూచనలు మహిళలను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది జరగబోయే ఎలక్షన్లలో ఈటెల రాజేందర్ మల్కాజిగిరి పార్లమెంటులో అత్యధిక మెజార్టీతో గెలిపించగలరని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, మహిళా నాయకురాలు మునిగంటి అనూష రామ్ ప్రదీప్, కార్యకర్తలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

శ్రీరమణపురం కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 29 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ శ్రీరమణపురం కాలనీలో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. శ్రీరమణపురం నుంచి పారిశ్రామికవాడకు వచ్చే దారిలో మురుగునీటి సమస్యతోపాఉట, డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో వెంటనే స్పందించి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీరమణపురం కాలనీ సమస్యలను యుద్ధప్రాతిపధిక పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి జి.బి.సాయి, రత్నాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిన్నారావు, లక్ష్మారెడ్డి, స్వర్ణజ్యోతి, నరేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఎవరు అడ్డుకోలేరు : రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

సమావేశంలో పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎంపి అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డి

ఉప్పల్, మార్చి 29 ప్రభాతవార్త : మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరు అడ్డుకోలేరని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భగాయత్‌లో జరిగిన సమావేశంలో పార్టీ ఎంపి అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ గతంలో సిఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన మెజార్టీని తిరిగి సునీత మహేందర్‌రెడ్డికి ఇవ్వాలని కోరారు. ప్రతి నాయకుడు కార్యకర్త ఎన్నికల వరకు అప్రమత్తంగా ఉండాలని గుర్తు చేశారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎం.రజితరెడ్డి, బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, పిసిసి ప్రతినిధులు తౌఫిక్, కంది ఆగిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, సీతారాంరెడ్డి, కంది శ్రవణ్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, అకారపు అరుణ్‌కుమార్, బజారు జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఘనంగా టిడిపి అవిర్భావ వేడుకలు

ఉప్పల్, మార్చి 29 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ అవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం చిలుకానగర్ డివిజన్‌లో టిడిపి డివిజన్ అధ్యక్షుడు పబ్బతి శేఖర్‌రెడ్డి ఆధ్వర్వంలో అవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టిడిపితోనే తెలుగు ప్రజలకు గుర్తింపు వచ్చిందని,తెలంగాణలో టిడిపి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు సాయి నాగార్జున, నియోజకవర్గం అధ్యక్షుడు బజారు హేమంత్ గౌడ్, అనిల్, శివ, కెసి సాయి, మనోజ్, ఇమామ్, బంక రమేష్, డా.రాముబాలు తదితరులు పాల్గొన్నారు.

భక్తి విశ్వాసంతోనే పాప పరిహార్థం: దేవానంద్

ఎల్.బి.నగర్, మార్చి 29 ప్రభాతవార్త: సకల మానవాళి పాపపరిహారార్థం ప్రబువైన యేసుక్రీస్తు మరణించి పునరుత్థానుడై మరణం జయించి లేచిన రోజు క్రైస్తవ భక్తి, విశ్వాసం, నిరీక్షణకు ఆధారమని యల్.బి.నగర్ నియోజకవర్గం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ యం.దేవానంద్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోనే సెయింట్ మాథ్యూస్ ఫుల్ గోస్పాల్ చర్చ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున క్రీస్తు సమాధి నుండి సజీవంగా లేచారని అట్టి పర్వదినం సందర్భంగా ఆదివారం యల్.బి.నగర్ యస్.కె.గార్డెన్స్ ఫంక్షన్ హాలులో తెల్లవారుజామున 4.30లకు క్రీస్తు పునరుత్థాన ఆరాధన కార్యక్రమం జరుగుతుందని నియోజకవర్గం క్రిస్టియన్ సహోదరీ, సహోదరులు హాజరై సమావేశంను జయప్రదం చేసి దేవుని దీవెనలు